తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice
వార్త పత్రిక

12-07-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 154

PUBLISHED FROM HYDERABAD  పేజీలు-8  వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice
వార్త పత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## కాళేశ్వరంపై బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొడతాం: సీఎం రేవంత్ రెడ్డి

- కాళేశ్వరం అంశంపై ప్రతిపక్షాలపై సీఎం విమర్శలు
- మేడిగడ్డ లోపాలు కేసీఆర్ హయాంలోనే బయటపడ్డాయని వ్యాఖ్య
- ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం
- కేంద్ర కమిటీతో పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని వెల్లడి

2



## కాంగ్రెస్ తెచ్చిన కరవు ఇది: కేటీఆర్

- కాళేశ్వరం ద్వారా నీటి ఎత్తిపోతలపై ప్రభుత్వంపై విమర్శలు
- కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయే అవకాశం ఉందన్న మాజీ మంత్రి
- రైతాంగాన్ని రాజకీయ కక్షతో నష్టపరుస్తున్నారని ఆరోపణ
- రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం నివేదికను పరిశీలించాలని సూచన

**హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్**

"ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కక్షతో పక్కనపెట్టి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై

మిగతా 2వ పేజీలో..




## హైటెక్ హంగులతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్..

- రూ. 26 కోట్లతో అమృత్ స్టేషన్ పథకం కింద సర్వాంగ సుందరంగా మార్పు
- ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం
- ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఆధునిక వెయిటింగ్ హాల్‌తో ప్రయాణికులకు ఊరట
- దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు, పచ్చదనంతో ఆహ్లాదకరమైన స్టేషన్ ప్రాంగణం
- నిత్యం వేలాది మంది ఐటీ ఉద్యోగులకు మెరుగైన రవాణా అనుభవం

3


## ఆ హత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

- రేవంత్ రెడ్డి తక్షణమే సీఎం, హోంమంత్రి పదవులకు రాజీనామా చేయాలి
- ల్యాండ్ సెటిల్మెంట్లకు అడ్డాలుగా పోలీస్ స్టేషన్లు
- మాజీ మంత్రి హరీశ్ రావు

2



# రైతు డిస్కమ్ పాలనకు మార్గం సుగమం..!



- లైసెన్స్ జారీ చేసిన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి
- చట్టబద్ధమైన ట్రాన్స్ఫర్ స్కీమ్ అమలు చేస్తేనే లైసెన్స్ ఉనికిలోకి
- మెలిక పెట్టిన ఈఆర్సీ!
- నాలుగు నెలల తర్వాత నుంచి ప్రారంభం కానున్న రైతు డిస్కమ్ కార్యకలాపాలు
- వ్యవసాయ బోర్ కనెక్షన్లకు ఎలాంటి మీటర్లు పెట్టబోం
- ఉచిత విద్యుత్ యథావిధిగా కొనసాగింపు
- ఉద్యోగుల హక్కులకు నష్టం కలగకుండా చూడాలని ఈఆర్సీ స్పష్టీకరణ

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలనుకున్న 'తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ' పాలనకు ఎట్టకేలకు ఒక కీలక అడుగు పడింది. ఎన్నో అవాంతరాలు, అభ్యంతరాల మధ్య నలిగిన రైతు డిస్కమ్‌కు శుక్రవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు చేస్తూ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ సంస్థకు పాలనా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అధికారిక మార్గం సుగమమైంది. టీజీఆర్పీడీసీఎల్ లైసెన్స్ కోసం ఈ ఏడాది మార్చి 19న టీజీఈఆర్సికి దరఖాస్తు చేసుకోగా.. ఈ దరఖాస్తుపై మే 29న కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వినియోగదారుల సంస్థలు, విద్యుత్ రంగ నిపుణుల నుండి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను అంశాల వారీగా పరిశీలించి కమిషన్ తన ఉత్తర్వుల్లో వీటికి సమాధానాలు పొందుపరిచింది. విద్యుత్ చట్టం-2003లోని సెక్షన్ 14తో పాటు సెక్షన్ 131 ప్రకారం లైసెన్స్ మంజూరు చేసింది. ఇక నుండి ఈ రైతు డిస్కమ్ రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ/సంయుక్త రక్షిత తాగునీటి పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై

మిగతా 3వ పేజీలో..



## పోక్సో కేసు.. కక్షతో ఆరుగురి హత్య

- రంగారెడ్డి జిల్లాలో దారుణం
- పోలీసుల వైఖరికి నిరసనగా బాధిత కుటుంబీకుల ఆందోళన
- షాబాద్ ఎసై సస్పెన్షన్
- ఘటనపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి
- కఠినంగా శిక్షిస్తాం : జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల

**షాబాద్, జూలై 11, సిరి న్యూస్ :**
రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో ఆరుగురి హత్య కలకలం రేపింది. పోక్సో కేసు పెట్టారన్న కోపంతో ఓ వ్యక్తి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని అతి కిరాతకంగా హత్య చేయడమేగాక తన భార్య, ఇద్దరు పిల్లలను కూడా హత్య చేసి పరారయ్యాడు. పోలీసులు

మిగతా 3వ పేజీలో..



## ఎమిరేట్స్ విమాన సర్వీసులను పెంచాలి

### ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌ను కోరిన సీఎం

**హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్ :**

ఎమిరేట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆ సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హాన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఎ380 సర్వీసులను ప్రారంభించేందుకు సుముఖత

మిగతా 2వ పేజీలో..



## ఉద్యోగుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత

- విద్యుత్ రంగంలో జీరో ఫేటల్ యాక్సిడెంట్స్ లక్ష్యంగా అడుగులు
- అతివిశ్వాసం వద్దు.. పనిలో భద్రతా ప్రమాణాలు పాటించాలి
- ప్రమాద రహిత విద్యుత్ వ్యవస్థ కోసం నిరంతర కృషి
- సీఎండీ జితేష్ వి. పాటిల్
- సురక్ష 2026 సేఫ్టీ ఎక్స్‌పో అండ్ వర్క్‌షాప్ ప్రారంభించిన సీఎండీ

3

## భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

- వచ్చే మార్చి నాటికి మూడు విడతల్లో పూర్తి చేయాలి
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి

2




## మల్లారెడ్డి మనసు మారిందా?

- కేటీఆర్ సమావేశానికి గైర్హాజరు.. రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు
- బీఆర్ఎస్ కీలక సమావేశానికి దూరమైన మాజీ మంత్రి
- పార్టీ మార్పుపై మళ్లీ జోరందుకున్న ప్రచారం
- అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూపులు

2



## సెమీకండక్టర్ల తయారీలో మరో కీలక ముందడుగు



- దేశంలో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీస్ హబ్
- టీ-వర్క్స్‌లో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్ :**

సెమీకండక్టర్ల తయారీ రంగంలో తెలంగాణ మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో చిప్‌ల తయారీలో అత్యంత కీలకమైన కెమికల్ మెకానికల్ పాలిషింగ్

మిగతా 2వ పేజీలో..




## ఎమిరేట్స్ విమాన సర్వీసులను పెంచాలి

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తం చేశారు. ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరేట్స్ ఎమ్మార్వో ఆపరేషన్స్ కొనసాగించాలని, విమాన సర్వీసులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌కు ముందుకు రావాలని కూడా సర్హాన్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

## సెమీకండక్టర్ల తయారీలో మరో కీలక ముందడుగు

**మొదటిపేజీ తరువాయి**

(సీఎంపీ) ప్యాడ్ టెక్నాలజీకి సంబంధించిన దేశంలోనే తొలి హబ్ హైదరాబాద్‌లో ఏర్పాటైంది. జపాన్‌కు చెందిన తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ సహకారంతో టీవర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో తాజాగా ప్రారంభించిన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సెమీకండక్టర్ చిప్‌ల తయారీలో వాఫర్‌ను సమతలంగా మార్చేందుకు ఉపయోగించే ఈ సీఎంపీ ప్యాడ్లను ప్రస్తుతం పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ హబ్ ఏర్పాటుతో హైదరాబాద్ వేదిక అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు ఈ కేంద్రం ద్వారా శిక్షణతోపాటు పరిశోధనలు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యంతో వచ్చే 18 నుంచి 24 నెలల్లో సీఎంపీ ప్యాడ్లను దేశంలోనే తయారు చేసేలా సంయుక్త పరిశోధనలు చేపడతామని వివరించారు. సెమీకండక్టర్ రంగంలోని అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు జపాన్ లాంటి దేశాలతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. పరిశోధన నుంచి చిప్‌ల తయారీ వరకు అవసరమైన సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి టకుయా నిషిమురా, జెట్రో బెంగళూరు డైరెక్టర్ జనరల్ స్వస్తిక్ కులకర్ణి, ఇండోబాక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో డైసుకే టాంజి, జపాన్ ఇండియా బిజినెస్ బ్యూరో ఛైర్మన్ షిగెమారో యాసుయి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీవర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.



## పార్టీలకతీతంగా ఉద్యమకారుల గుర్తింపునకు మద్దతు

- **టీజేఏసీ స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం**
- **స్వాగతించిన సంప్రదింపుల కమిటీ**

**హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్ :**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరుల స్మారక చిహ్నంలో జరుగుతున్న సంప్రదింపుల ప్రక్రియలో శనివారం చరిత్రాత్మక మైలురాయి నమోదైంది. పార్టీలతో సంబంధం లేకుండా నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియకు తామంతా సంపూర్ణ మద్దతు అందజేస్తామని టీజేఏసీ స్టీరింగ్ కమిటీ అగ్ర నాయకులు, వివిధ అనుబంధ జేఏసీల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కమిటీ ఛైర్మన్ కేకే, సభ్యుల ముందు ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉద్యమ కాలంలో యావత్ తెలంగాణను ఏకతాటిపైకి తెచ్చిన టీజేఏసీకి చెందిన ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కమిటీ ముందు అధిక సంఖ్యలో హాజరయ్యారు. టీజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులందరూ తమ అమూల్యమైన సలహాలు, సూచనలను కమిటీకి రాతపూర్వకంగా అందించారు. ఉద్యమ కాలం నాటి ఉమ్మడి స్టీరింగ్ కమిటీ డైరెక్టరీ ఆధారంగా వివిధ రంగాల నుండి ప్రతినిధులు హాజరై తమ ఐక్యతను చాటారు. టీజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యుల ఈ అపూర్వమైన ఏకగ్రీవ మద్దతును కమిటీ ఛైర్మన్ డాక్టర్ కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ఇతర ప్యానల్ సభ్యులు స్వాగతించారు. ఈ సంపూర్ణ సహకారం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న చివరి ఉద్యమకారుడిని కూడా ఎలాంటి తప్పులు లేకుండా గుర్తించడం సులువవుతుందని హర్షం వ్యక్తం చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా జరుగుతున్న డిజిటల్ స్క్రీనింగ్ ఆధారంగా అత్యంత పారదర్శకమైన తుది నివేదికను తయారు చేసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి అందిస్తామని కమిటీ ఛైర్మన్ చెప్పారు.

ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు: టీజీవో తరపున వి.శ్రీనివాస్ గౌడ్, ఏలూరి శ్రీనివాస రావు; టీఎన్జీవో తరపున కె.స్వామిగౌడ్, జి.దేవీప్రసాద్, కారం రవీందర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

కోర్ సెక్టార్ అండ్ రవాణా సంఘాలు: ఆర్టీసీ జేఏసీ తరపున దొంతు ఆనందం, రాజిరెడ్డి, ఎలక్ట్రిసిటీ జేఏసీ నుండి కె. రఘు పాల్గొన్నారు.

వృత్తిపరమైన, సామాజిక జేఏసీలు: అడ్వకేట్ జేఏసీ నుండి ఎం.రాజేంద్ర రెడ్డి, ఎన్.ప్రహ్లాద్, డాక్టర్స్ జేఏసీ నుండి డాక్టర్ సురేష్ చంద్ర, ఇంజనీర్స్ జేఏసీ నుండి శ్రీధర్ దేశ్‌పాండే, టి.వెంకటేశం, ఎం.బాలనర్సయ్య.

సామాజిక, ఉపాధ్యాయ, సాంస్కృతిక సంఘాలు: తెలంగాణ మాల మహానాడు తరపున టిఎంఆర్ పిఎస్ నుండి బొట్ల భిక్షపతి, తెలంగాణ వికాస సమితి నుండి పిట్టల రవీందర్, ఉపాధ్యాయ సంఘాల నుండి ఎం.మణిపాల్ రెడ్డి (టీఆర్‌టీయూ), ఎంపీజే తరపున హమీద్ మహ్మద్ ఖాన్, ప్రైవేట్ స్కూల్స్ జేఏసీ (టీఆర్ఎస్ఎంఏ) ప్రతినిధులు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు: నాటి ఉద్యమంలో కలిసి పనిచేసిన ప్రధాన రాజకీయ పక్షాల (టీఆర్ఎస్, బీజేపీ, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ) నాటి స్టీరింగ్ కమిటీ మెంబర్లు ఈ సమావేశంలో భాగస్వాములయ్యారు.

**ప్రధాన సూచనలు, డిమాండ్లు**

సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు క్షేత్రస్థాయి ఉద్యమకారులకు తక్షణ న్యాయం చేకూర్చాలని కోరుతూ గత తీర్మానాలకు అనుగుణంగా తమ డిమాండ్లను కమిటీ ముందు ఉంచారు. పార్టీల హద్దులు దాటి ప్రతి నిజమైన పోరాట యోధునికి అధికారిక ప్రభుత్వ ప్రశంసా పత్రం మంజూరు చేయాలి.

# భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

**ఖమ్మం/హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్ :**



భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. భూ రీసర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'ధరణి'ని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, అయితే చట్టం అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని అంగీకరించారు. భూ భారతి సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీసర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు శుక్రవారం పంపిణీ చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.

**మార్చి 2027 నాటికి మూడు విడతల్లో**

రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూ రీసర్వేను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిపై ప్రతి నెలా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. తొలి విడతలో భాగంగా ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టినట్లు చెప్పారు. ఇందుకోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రీసర్వేలో పనిచేసే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తోపాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 అందజేస్తామని, విధుల్లో చేరని వారికి గడువు ఇచ్చి ఆపై లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.

**సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణపై ఆరా**

ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని మంత్రి పేర్కొన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ఒక సర్వే నంబరులో కొంత భూమిని ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత (22ఎ) జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

**గుడిసెల్లో నివసించే వారికే తొలి ప్రాధాన్యం**

మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలన్నారు. రెండో విడత ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేయాలని, ఇందులో గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికీ కనీసం ఒక జత యూనిఫాం అందేలా విద్యాశాఖ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# మల్లారెడ్డి మనసు మారిందా?

**హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్**



గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ఓటర్ల జాబితా సవరణ, గ్రేటర్ పరిధిలో పార్టీ బలోపేతంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన కీలక సమావేశానికి మల్లారెడ్డి హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు దారితీసింది. ఇప్పటికే ఆయన పార్టీ మారనున్నారనే ప్రచారం కొనసాగుతుండగా, ఈ పరిణామం ఆ చర్చకు మరింత ఊతమిచ్చింది. అయితే దీనిపై ఇప్పటివరకు మల్లారెడ్డి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

**బీజేపీతో సంప్రదింపులపై ప్రచారం**

గత కొంతకాలంగా మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి బీజేపీ అగ్రనేతలతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోనూ పలువురు బీజేపీ నాయకులను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై చర్చలు సాగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రచారాన్ని సంబంధిత నాయకులు లేదా బీజేపీ అధికారికంగా ధృవీకరించలేదు.

**కుటుంబ రాజకీయాలపై చర్చ**

మల్లారెడ్డి కుటుంబ రాజకీయ భవిష్యత్తుపైనా చర్చ సాగుతోంది. ఆయన కోడలు ప్రీతిరెడ్డి రాజకీయంగా మరింత చురుకుగా వ్యవహరిస్తుండటంతో ఆమెకు భవిష్యత్‌లో కీలక బాధ్యతలు దక్కే అవకాశాలపై ప్రచారం జరుగుతోంది. అలాగే కుటుంబ సభ్యులకు రాబోయే ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించే అంశంపై వివిధ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే దీనిపైనా అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు.

**బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బేనా?**

గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే ప్రయత్నాల్లో ఉన్న సమయంలో మల్లారెడ్డి కీలక సమావేశానికి దూరంగా ఉండటం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది. మేడ్చల్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఆయనకు ఉన్న రాజకీయ, సామాజిక ప్రభావం దృష్ట్యా ఆయన భవిష్యత్ నిర్ణయం ఆ ప్రాంత రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**అధికారిక నిర్ణయంపై ఉత్కంఠ**

మల్లారెడ్డి రాజకీయ భవిష్యత్తుపై ప్రస్తుతం పలు ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఆయన ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారా, లేక మరో పార్టీలో చేరుతారా అనే అంశంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అప్పటి వరకు పార్టీ మార్పుపై జరుగుతున్న ప్రచారం అధికారిక నిర్ధారణ లేనిదేనని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.



## కాంగ్రెస్ తెచ్చిన కరవు ఇది: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర విమర్శలు చేశారు.

**కాళేశ్వరం ద్వారా నీటి ఎత్తిపోతలు సాధ్యమే**

రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను ముఖ్యమంత్రి పరిశీలించాలని కేటీఆర్ సూచించారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి మట్టం ఉందని, 94 మీటర్ల నీటి లభ్యత ఉన్నప్పుడే పంపులను ప్రారంభించవచ్చని వివరించారు.

**200 టీఎంసీల నీటిని ఎత్తిపోయే అవకాశం**

ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ మరో 100 రోజుల పాటు నీటి ప్రవాహం కొనసాగుతుందని కేటీఆర్ అన్నారు. రోజుకు రెండు టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని చెప్పారు. అయినప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నీటిని ఎత్తిపోవడం లేదని ఆరోపించారు.

**ప్రభుత్వంపై విమర్శలు**

రాజకీయ కక్షతో రైతాంగ ప్రయోజనాలను ప్రభుత్వం విస్మరిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఇదే విధంగా పాలన కొనసాగితే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదురవుతుందని, 117 సీట్లు కాదు, ఏడు సీట్లు కూడా రావని వ్యాఖ్యానించారు.

# ఆ హత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

**హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్ :**

షాబాద్ లో జరిగిన హృదయ విదారక సంఘటన ప్రతి మధ్య తరగతి, పేద కుటుంబాన్ని తీవ్రంగా కల చివేసిందని, ముఖ్యంగా ఆడపిల్లలున్న తల్లిదండ్రులందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధిపేట క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోక్సో కేసు నిందితడు ముగ్గురు పసిపిల్లలు సహా ఒకే రాత్రి ఆరుగురిని ఆరు హత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే. కిరాతకంగా చంపేయడం రా ష్ట్ర ప్రభుత్వం, పోలీసుల వైఫల్యానికి సజీవ సాక్ష్యమని ధ్వజమెత్తారు. శాంతిభద్రతలను గాలికి వదిలేసిన రేవంత్ రెడ్డికి నైతిక విలువలు ఉంటే తక్షణమే తన ముఖ్యమంత్రి, హోంమంత్రి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**పోలీసుల నిర్లక్ష్యమే**

మే 16న ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగితే.. నిందితుడిని అరెస్ట్ చేయడంలో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారని హరీశ్ రావు ఆరోపించారు. అవినీతికి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయిన పోలీసులు నిందితుడికి కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సాధారణ సెక్షన్లు పెట్టి కాపాడే ప్రయత్నం చేశారన్నారు. "మాకు ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించండి" అని ఆ బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి మొత్తుకున్నా పోలీసులు పట్టించుకోలేదని మండిపడ్డారు. సరైన సమయంలో ఏసీపీ, డీసీపీ, కమిషనర్ స్థాయిలో సమీక్ష చేసి కఠిన సెక్షన్లు పెట్టి ఉంటే ఈరోజు ఈ ఆరు హత్యలు జరిగేవి కావన్నారు. నెల రోజుల పాటు అతన్ని అరెస్ట్ చేయకుండా వదిలేయడంతోనే అతను కోర్టు నుంచి యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకుని ఈరోజు కుటుంబాన్నే అంతం చేశాడని దుయ్యబట్టారు.



# కాళేశ్వరంపై బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొడతాం: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 11, సిరి న్యూస్**



"కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు. ప్రాజెక్టును రాజకీయాల కోసం వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలను తిప్పికొడతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, గోదావరి జలాల ఎత్తిపోతల అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కొంతమంది రిటైర్డ్ ఇంజనీర్లను అడ్డం పెట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

**మేడిగడ్డ లోపాలు గత ప్రభుత్వ హయాంలోనే**

కాళేశ్వరం ప్రాజెక్టును 2019లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించిన కొద్ది కాలానికే మేడిగడ్డ బ్యారేజీలో సాంకేతిక లోపాలు వెలుగుచూశాయని సీఎం తెలిపారు. కేసీఆర్ సాగునీటి శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలోనే అధికారులు సమస్యలను గుర్తించారని, వాటిని సకాలంలో పరిష్కరించకపోవడం వల్లే పరిస్థితి ఈ స్థాయికి చేరిందన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిన్న తర్వాత కూడా మరమ్మతులు చేపట్టలేదని విమర్శించారు.

**ఎన్‌డీఎస్ఏ నిబంధనల ప్రకారమే చర్యలు**

మూడు బ్యారేజీల ప్రస్తుత పరిస్థితిపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం అమలు చేస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల్లో నీటి నిల్వపై కేంద్ర సంస్థ నిర్దేశించిన నిబంధనలను పాటించాల్సిందేనని చెప్పారు. గేట్లు మూసి నీటిని నిల్వ చేయడం, మరమ్మతులు చేపట్టడం వంటి చర్యలకు సంబంధిత కేంద్ర సంస్థల అనుమతులు తప్పనిసరని వివరించారు. సాంకేతిక పరిమితులను విస్మరించి విమర్శలు చేయడం సరికాదన్నారు.

**పునరుద్ధరణకు కేంద్ర కమిటీ**

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని సీఎం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిపుణుల సహకారంతో అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రాజెక్టును సురక్షితంగా పునరుద్ధరించి రైతులకు ఉపయోగపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**ప్రతిపక్షాలపై విమర్శలు**

బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సీఎం ఆరోపించారు. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కూడా బీఆర్ఎస్ వాదనలకు మద్దతు ఇవ్వడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేయకుండా రాజకీయ విమర్శలకు పరిమితం కావడం ప్రజలకు ఉపయోగపడదని వ్యాఖ్యానించారు. రిటైర్డ్ ఇంజనీర్ల అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వల్ల వాస్తవాలు మారవని, కాళేశ్వరం అంశంలో ప్రభుత్వం సాంకేతిక నిపుణుల సూచనల మేరకే నిర్ణయాలు తీసుకుంటోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రైతు డిస్కమ్ పాలనకు మార్గం సుగమం..!

మొదటిపేజీ తరువాయి

అండ్ సీవరేజ్ బోర్డుతో పాటు ప్రత్యేక పంపిణీ ట్రాన్స్ఫార్మర్ల ద్వారా విద్యుత్ పొందుతున్న మున్సిపల్ తాగునీటి కనెక్షన్లకు సేవలు అందించనుంది.

**నాలుగు నెలల తర్వాతే**
**కార్యకలాపాలు.. ఈఆర్సీ మెలిక**

ఉత్తర్వులు జారీ అయినప్పటికీ, ఈ ఆదేశాల తేదీ నుండి నాలుగు నెలల తర్వాతే తెలంగాణ రైతు డిస్కమ్ తన పూర్తి స్థాయి వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించాలని కమిషన్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఈఆర్సీ ఒక కీలకమైన మెలిక పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 131 ప్రకారం చట్టబద్ధమైన ట్రాన్స్ఫర్ స్కీమ్ ను అధికారికంగా జారీ చేసి.. సంబంధిత ఆస్తులు, అప్పులు, వినియోగదారులను టీజీఆర్పీడీసీఎల్‌కు బదిలీ చేసిన తర్వాతే ఈ లైసెన్స్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. మరోవైపు విద్యుత్ చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్‌లు దాఖలు చేసిన దరఖాస్తులను కూడా కమిషన్ ఆమోదించింది. రైతు డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభమైన తేదీ నుండి బదిలీ అయ్యే వినియోగదారుల వర్గాలను ఈ రెండు పాత డిస్కమ్‌ల పరిధి నుండి తొలగిస్తూ వాటి లైసెన్సులను సవరించింది. మిగతా సాధారణ వినియోగదారులకు సేవలు అందించే బాధ్యతల్లో,



భౌగోళిక పరిధిలో ఎలాంటి మార్పు ఉండదు. ఈ మార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేలా కమిషన్ పలు ఆదేశాలిచ్చింది.

**వ్యవసాయానికి ఉచిత విద్యుత్ యథాతథం..**

రైతుల్లో ఉన్న అతిపెద్ద ఆందోళనపై ఈఆర్సీ క్లారిటీ ఇచ్చింది. తెలంగాణాలో ఏర్పాటవనున్న రైతు డిస్కమ్‌లో వ్యవసాయానికి అందిస్తున్న ఉచిత విద్యుత్ సరఫరా భవిష్యత్తులోనూ యథావిధిగా కొనసాగుతుందని, ఈ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. అలాగే వ్యక్తిగత వ్యవసాయ బోరు బావుల కనెక్షన్లకు ఎలాంటి మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా కమిషన్ తన ఉత్తర్వుల్లో అధికారికంగా నమోదు చేసింది. టీజీఆర్పీడీసీఎల్ కూడా ఇతర డిస్కమ్‌ల మాదిరిగానే టారిఫ్, సేవా ప్రమాణాలు, వినియోగదారుల హక్కులు, నివేదికల సమర్పణ తదితర అన్ని అంశాల్లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ప్రత్యక్ష పర్యవేక్షణలోనే పనిచేస్తుందని స్పష్టం చేసింది.

**ఈఆర్సి విధించిన కీలక నిబంధనలు ఇవే..**

= టీజీఆర్పీడీసీఎల్ మూడు నెలల లోపు లోడ్ అంచనాలు, లైన్ నష్టాల తగ్గింపు, ఇంటర్ఫేస్ మీటరింగ్, సిబ్బంది, ఆర్థిక అంశాలతో కూడిన సమగ్ర వ్యాపార ప్రణాళికను కమిషన్‌కు సమర్పించాలి.

= మూడు డిస్కమ్‌ల మధ్య ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, వినియోగదారుల డేటా బదిలీ, విద్యుత్ సరఫరా, ఎనర్జీ అకౌంటింగ్ తదితర అంశాలపై అవగాహన ఒప్పందాలు, సేవా ఒప్పందాలు, బల్క్ సప్లై ఒప్పందాలు కుదుర్చుకుని కమిషన్ ఆమోదానికి పంపాలి.

= 202627 ఆర్థిక సంవత్సర మిగిలిన కాలానికి టారిఫ్, ప్రభుత్వ సబ్సిడీ పంపిణీపై డిస్కమ్‌లు కమిషన్‌ను ఆశ్రయించాలి. అలాగే 2027 28 టారిఫ్ ప్రతిపాదనలను నవంబర్ 30, 2026లోపు సమర్పించాల్సి ఉంటుంది.

= టీజీఆర్పీడీసీఎల్ కనీసం రెండు వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికలను ఏర్పాటు చేయాలి. అప్పటివరకు ఉన్న రెండు పాత డిస్కమ్‌లలోని ప్రస్తుత ఫోరమ్‌లే బదిలీ అయ్యే వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరిస్తాయి.

= మార్పిడి ప్రక్రియ జరుగుతున్న నెపంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సహా కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరును ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయరాదు. టీజీఆర్పీడీసీఎల్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే వరకు టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్‌లు యథావిధిగా దరఖాస్తులు స్వీకరించి కొత్త కనెక్షన్లు మంజూరు చేయాలి.

= విద్యుత్ ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చట్టబద్ధమైన ఏర్పాట్లు చేయాలని కమిషన్ స్పష్టం చేస్తూ, ఈ మేరకు ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉత్తర్వుల్లో పొందుపరిచింది.

# పోక్సో కేసు.. కక్షతో ఆరుగురి హత్య

మొదటిపేజీ తరువాయి

తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని దైవాలగూడకు చెందిన ఓ బాలిక రాజ్‌కుమార్ అనే వ్యక్తి తనను వేధిస్తున్నాడంటూ మే 16న తల్లితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి అతడిని అరెస్టు చేశారు. తనపై పోక్సో కేసు పెట్టిన కుటుంబంపై అతడు కక్ష పెంచుకున్నాడు. బెయిల్‌పై ఇంటికి వచ్చిన అతడు శనివారం తెల్లవారుజామున బాలిక ఇంటికి వెళ్లాడు. ఆ కుటుంబంలోని ముగ్గురిని అతి కిరాతకంగా హత్య చేశాడు. బాలికను హత్య చేసే ముందు పొలంలోకి లాక్కెళ్లి లైంగిక దాడి జరిపాడు. అనంతరం తన భార్య సరిత, మూడేళ్ల కూతురు, రెండేళ్ల కుమారుడిని కూడా హత్య చేశాడు. హత్యల తర్వాత తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. 'నేను ఆరుమందిని మర్డర్ చేశాను.. ఒకచోట ముగ్గురిని, మరొక చోట ముగ్గురిని హతమార్చాను.. నేను కూడా చచ్చిపోతున్నా' అని చెప్పాడు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని పోలీసులకు చెప్పగా అప్రమత్తమైన వారు ఘటనా స్థలానికి చేరుకునే లోపే నిందితుడు పరారయ్యాడు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తన భార్యాపిల్లలను ఎందుకు చంపాడన్నది మిస్టరీగా మిగిలింది. ఈ ఘటనలో ఎలాంటి గ్యాంగ్ ప్రమేయం లేదని, రాజ్‌కుమార్ ఒక్కడే ఆరుగురిని చంపినట్లు స్పష్టం చేశారు. నిందితుడిపై మే 16న పోక్సో కేసు నమోదైందని, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడని తెలిపారు. 'నిందితుడు రాజ్‌కుమార్ రాత్రి 11 నుంచి 11:30 గంటల మధ□్యలోనే ఈ ఆరుగురినీ హతమార్చాడు.. మొదట బాధితురాలి ఇంట్లోకి చొరబడి ఆమె తల్లి, నానమ్మలను చంపేశాడు.. బాలికను దైవాలగూడ చెరువు దగ్గరకు తీసుకెళ్లి అక్కడ ఆమెను హత్య చేశాడు.. తర్వాత తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు పిల్లలను కూడా అతికిరాతకంగా హతమార్చాడు.. అనంతరం తన తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పి మొబైల్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు.. నిందితుడి నేర చరిత్రను పరిశీలిస్తే గతంలో అతడిపై పోక్సో కేసుతోపాటు మరో కేసు కూడా నమోదైంది.. అతడికి బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి వ్యసనాలు



ఉన్నాయి. దీంతో అతనికి రూ.కోటిన్నర వరకు అప్పులు ఉన్నట్లు తేలింది. రాజ్‌కుమార్‌ను పట్టుకోవడానికి ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాం' అని సీపీ వివరించారు. రాజ్‌కుమార్ ప్రయాణించిన కారును పోలీసులు నందిగామ సమీపంలో గుర్తించారు. నిందితుడు కారు వదిలి నందిగామ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. దీంతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రత్యేక బృందాలు అతడి కోసం విస్తృతంగా గాలిస్తున్నాయి. కారును స్వాధీనం చేసుకుని దాని ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు.

**షాబాద్ ఎఐ సస్పెన్షన్**

ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని ఆరోపిస్తూ నిరసన చేపట్టారు. పోక్సో కేసును మొదటి నుంచే సక్రమంగా దర్యాప్తు చేసి, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ ప్రాణనష్టం జరిగేది కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కేసు విచారణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు షాబాద్ ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తమ నిరసనను విరమించారు.

**హత్యకు దారితీసిన పరిస్థితులు**

సరిత అనే మహిళను రాజ్‌కుమార్ ప్రేమించి 2018లో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. అయినా ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించసాగాడు. విషయం తెలిసిన బాలిక తల్లి ఆమెను కాలేజీకి పంకుండా ఇంట్లోనే ఉంచింది. ఒకసారి పరీక్షల కోసం బాలిక కాలేజీకి వెళ్లినప్పుడు ఆమెను లాక్కెళ్లేందుకు యత్నించాడు. అప్పుడు ఆమె తల్లి చాకచక్యంగా వ్యవహరించి నిందితుడి నుంచి బాలికను తప్పించింది. అప్పటినుంచి బాలికపై రాజ్‌కుమార్ పలుమార్లు బెదిరింపులకు పాల్పడినట్లు, మీ నాన్నను ఎలా చంపేశారో మిమ్మల్ని కూడా అలాగే చంపేస్తానని గతంలో బెదిరించాడని స్థానికులు చెబుతున్నారు. నిందితుడు బహిరంగంగా తిరుగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నా, పోక్సో కేసు నమోదైనప్పటికీ బాలికకు ఎలాంటి రక్షణ కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిర్లక్ష్యమే ఈ దారుణానికి ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. గతంలో భూతగాదాలో ఇద్దరిని బెదిరించినందుకు రాజ్‌కుమార్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు సమాచారం. మరోవైపు పోక్సో కేసులో ఏడేళ్లు మాత్రమే శిక్షపడేలా తేలికైన సెక్షన్లను పోలీసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో కేవలం రూ.20వేల పూచీకత్తుతో రెండు నెలల్లోనే బెయిల్ రాగా బయటకు వచ్చిన రాజ్‌కుమార్ ఆరుగురిని కిరాతంగా హత్య చేశాడని స్థానికులు మండిపడుతున్నారు.

**దైవాలగూడకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్ట్**

ఆరుగురిని హత్య చేసిన ఘటనకు సంబంధించిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. షాబాద్ మండలం దైవాలగూడకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వెళ్తుండగా చేవెళ్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిలను శంకర్‌పల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. పటోళ్ల కార్తీక్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు.

> **ఉన్మాదిని కఠినంగా శిక్షిస్తాం : దుద్దిళ్ల**
>
> ఆరుగురి హత్య ఘటనపై రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్మాదిని అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపామని, అతడు ఎక్కడ ఉన్నా పట్టుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేశార□ని తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

**ఘటనపై మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి**

దైవాలగూడ హత్యల ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజస్థాన్ పర్యటనలో ఉన్న ఆమె ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషితో ఫోన్‌లో మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కూడా ప్రత్యేకంగా మాట్లాడారు. బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని, మానసిక, సామాజిక పరమైన తోడ్పాటు కల్పించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మహిళలు, పిల్లలు, కుటుంబాల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# పేదల బియ్యంపై రేషన్ మాఫియా పంజా

- **రెండు జిల్లాల్లో వరుస దాడులతో అంతర్రాష్ట్ర అక్రమ రవాణా గుట్టురట్టు**
- **మంచిర్యాలలో 28 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం**
- **ఆదిలాబాద్‌లో డంపింగ్ కేంద్రంపై దాడి**
- **రేషన్ డీలర్ల ప్రమేయంపై దర్యాప్తు**
- **ఏడుగురు అరెస్ట్.. ప్రధాన నిందితుడు పరారీ**

ఆదిలాబాద్/మంచిర్యాల, జూలై 11, సిరి న్యూస్

పేదలకు ఉచితంగా అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును అధికారులు రెండు వేర్వేరు ఆపరేషన్లలో బయటపెట్టారు. మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో నిర్వహించిన దాడుల్లో భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో రేషన్ దుకాణాల నిర్వాహకుల ప్రమేయం కూడా ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**మంచిర్యాలలో భారీ పట్టివేత**

మంచిర్యాల జిల్లా నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైదరాబాద్ సివిల్ సప్లయ్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక సమాచారంతో లారీని తనిఖీ చేశారు. డీఎస్పీ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీలో సుమారు 28 వేల కిలోల ప్రభుత్వ రేషన్ బియ్యం లభ్యమైంది. ఈ బియ్యాన్ని కరీంనగర్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని నస్పూర్ ఎంఎల్ఎస్ కేంద్రానికి తరలించి కేసు నమోదు చేశారు.

**ఆదిలాబాద్‌లో డంపింగ్ కేంద్రం**

ఆదిలాబాద్ జిల్లా జందాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీల సమయంలో స్కూటీపై రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో పట్టణంలోని ఖిల్లా ప్రాంతంలో అద్దె ఇంటిని రేషన్ బియ్యం నిల్వ కేంద్రంగా ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. అనంతరం అక్కడ నిర్వహించిన సోదాల్లో సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**రేషన్ డీలర్లపై ఆరోపణలు**

దర్యాప్తులో కొందరు రేషన్ దుకాణాల నిర్వాహకులు పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించి పాలిష్ చేసి, కొత్త సంచుల్లో ప్యాక్ చేసి సాధారణ బియ్యంగా మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

**ఏడుగురు అరెస్ట్**

ఈ కేసులో మొత్తం ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో ఏడుగురిని అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఫరాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఒక స్కూటీ, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేదలకు ఉద్దేశించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో రేషన్ మాఫియాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసులు హెచ్చరించారు.



# హైటెక్ హంగులతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్..

హైదరాబాద్, జూలై 11 (సిరి న్యూస్):

ఐటీ కారిడార్‌కు ప్రధాన రవాణా కేంద్రంగా ఉన్న హైటెక్ సిటీ రైల్వే స్టేషన్, అమృత్ స్టేషన్ పథకం కింద సరికొత్త హంగులతో రూపుదిద్దుకుంది. రూ. 26 కోట్ల భారీ బడ్జెట్‌తో చేపట్టిన ఈ ఆధునికీకరణ పనులు, స్టేషన్ వినియోగదారులకు కల్పిస్తున్న సౌకర్యాల పరంగా ఒక మైలురాయిగా నిలవనున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులు, సామాన్య ప్రయాణికులు ఎదుర్కొంటున్న రద్దీ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా రైల్వే అధికారులు ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేశారు. స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన కొత్త పోర్టికో ప్రయాణికులకు ఆకర్షణీయమైన స్వాగతాన్ని పలుకుతోంది. స్టేషన్ భవనాన్ని ఆధునిక ఆర్కిటెక్చర్‌తో పునరుద్ధరించడమే కాకుండా, ప్లాట్‌ఫారమ్‌ల వద్ద అదనపు షెడ్లను ఏర్పాటు చేసి ఎండ, వానల నుండి రక్షణ కల్పించారు. ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన వెయిటింగ్ హాల్‌లో అత్యాధునిక ఫర్నిచర్‌ను అమర్చారు. అంతే కాకుండా, స్టేషన్ ఆవరణలో ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టడం ద్వారా పర్యావరణహితమైన వాతావరణాన్ని కల్పించారు.

**దివ్యాంగులకు పెద్దపీట..**

ప్రయాణికులలోని అన్ని వర్గాల వారికి సమ ప్రాధాన్యతనిస్తూ, దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన సదుపాయాలతో కూడిన శౌచాలయాలను నిర్మించారు. స్టేషన్ మొత్తాన్ని దివ్యాంగ స్నేహపూర్వకంగా మార్చేందుకు అవసరమైన ర్యాంపులు, మార్కింగ్స్ మరియు సౌకర్యాలను కల్పించారు. తాగునీటి వ్యవస్థతో పాటు అత్యవసర డ్రైనేజీ సదుపాయాలను కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరించారు.

**రాబోయే అవసరాలకు**
**తగ్గట్టుగా ప్రణాళికలు..**

భవిష్యత్తులో పెరగనున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ అమృత్ స్టేషన్ ప్రాజెక్టును దశలవారీగా చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రోజుకు 3,000 మందికి పైగా ప్రయాణికులు వినియోగించుకుంటున్న ఈ స్టేషన్, రానున్న కాలంలో మరింత మందికి ప్రధాన రవాణా కేంద్రంగా మారనుంది. ఇప్పటికే 62 సబర్బన్ రైళ్ల రాకపోకలతో బిజీగా ఉన్న ఈ స్టేషన్‌లో, ఆధునిక ఎస్కలేటర్లు మరియు లిఫ్టుల ఏర్పాటు ప్రయాణ సమయాన్ని మరియు ఇబ్బందులను గణనీయంగా తగ్గించనుంది. త్వరలోనే ఈ స్టేషన్ అధికారికంగా ప్రయాణికులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. హైటెక్ సిటీ ప్రాంతానికి వచ్చే ప్రతి ప్రయాణికుడికి ఈ ఆధునిక స్టేషన్ ఒక సుఖవంతమైన, వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే కాకుండా, నగర రవాణా వ్యవస్థలో ఒక కీలకాంశంగా నిలుస్తుందని రైల్వే శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ఉద్యోగుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత

హైదరాబాద్, జులై 11 (సిరి న్యూస్):

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేసే ప్రతి ఉద్యోగి ప్రాణం సంస్థకు అమూల్యమని, భద్రతా ప్రమాణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని సీఎండీ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన సురక్ష 2026 సేఫ్టీ ఎక్స్‌పో అండ్ వర్క్‌షాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, భద్రతా నిబంధనలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకూడదని, ప్రతి ఉద్యోగి తన విధి నిర్వహణలో వాటిని ఆచరించాలని కోరారు. ముఖ్యంగా ఫోర్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు తమ బృందాల భద్రతకు బాధ్యత వహించాలని, సైన్యంలో కమాండర్ తన సైనికులను రక్షించినట్లుగా క్షేత్రస్థాయి సిబ్బందిని కాపాడాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిలిపివేతను, ప్రత్యామ్నాయ విద్యుత్ వనరులు లేవని ధృవీకరించుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని హెచ్చరించారు. సురక్ష 2026 పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోలో దేశంలోని ప్రముఖ సంస్థలు విద్యుత్ భద్రతా పరికరాలను ప్రదర్శించాయి. ఇన్సులేటెడ్ టూల్స్, ఫాల్ ప్రొటెక్షన్ సిస్టమ్స్, ఆధునిక టెస్టింగ్ ఉపకరణాలు, హైడ్రాలిక్ లిఫ్టింగ్ పరికరాలు మరియు ట్రీ ట్రిమ్మింగ్ టెక్నాలజీ వంటివి క్షేత్రస్థాయి సిబ్బందికి కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఈ ఆధునిక పరిజ్ఞానం వినియోగం ద్వారా విద్యుత్ ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సీఎండీ ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ లక్ష్యం కేవలం ప్రమాదాలను తగ్గించడం మాత్రమే కాదు.. 'జీరో ఫేటల్ యాక్సిడెంట్స్ జీరో నీర్ మిస్ ఇన్సిడెంట్స్' సాధించడమేనని జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. దీనికోసం అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ మరియు సాంకేతికతను అందించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రతి శనివారం నిర్వహించే ప్రజాబాట ద్వారా విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతున్నామని, వినియోగదారులు, రైతులు మరియు సాధారణ ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, వివిధ సర్కిళ్ల నుంచి వచ్చిన క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 18కి పైగా ప్రముఖ భద్రతా పరికరాల తయారీ సంస్థలు తమ ఉత్పత్తులను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించాయి.



## జగదేవ్‌పూర్‌లో గంజాయి స్వాధీనం
### ఇద్దరు అరెస్ట్



గజ్వేల్ జులై 11 (సిరి న్యూస్ )

జగదేవ్‌పూర్‌లో గంజాయి అక్రమ రవాణా కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసుల దాడిలో ఇద్దరు నిందితులు అరెస్ట్ కాగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.అరెస్ట్ అయిన వారు చింతకింది అజయ్ కుమార్ (20), బర్రెంకల శశిధర్ (25). పరారీలో ఉన్నవారు రాయవరం రాజు, చక్రి.పోలీసులు 80 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, హోండా యాక్టివా (TS-36-M-1365), రాయల్ ఎన్‌ఫీల్డ్ (TS-23-E-1147) వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితులు నెల రోజుల క్రితం నాగ్‌పూర్ నుంచి గంజాయి తెచ్చుకుని, జగదేవ్‌పూర్–గజ్వేల్ పరిసరాల్లో ఒక్కో ప్యాకెట్‌ను రూ.500కు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది.శనివారం జగదేవ్‌పూర్ సబ్‌స్టేషన్ వద్ద గంజాయి విక్రయిస్తున్న సమయంలో పోలీసులు దాడి చేయగా, చక్రి అక్కడి నుంచి పరారయ్యాడు.కేసు నమోదు చేసి అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచగా, పరారీలో ఉన్న వారి కోసం గాలింపు కొనసాగుతోంది.ఈ సందర్భంగా ఏసీపీ నర్సింలు మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు ఉంటాయని, సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

## చిన్న వంట గొడవ ప్రాణాలు తీసుకునే స్థాయికి!
### బీహార్ యువకుల ఘాతకం..

జిన్నారం జులై 11 సిరి న్యూస్



బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుల మధ్య శుక్రవారం రాత్రి ముదిరిన వంట రచ్చ, కత్తులతో దాడి చేసుకున్న ఘటన బొల్లారం పీఎస్ పరిధిలోని గడ్డపోతారంలో జరిగింది. వివరాలకు వెళితే బీహార్ రాష్ట్రానికి చెందిన రవి పటేల్, మిటిలేష్ కుమార్ ఒకే రూమ్ లో అద్దెకు ఉంటూ గడ్డపోతారంలోని పరిశ్రమలలో విధులు నిర్వహిస్తూ ఉన్నారు.చిన్న వివాదమే కారణం ప్రతిరోజు లాగే వంట, చేసే విషయంలో నువ్వు చెయ్ అంటే, నువ్వు చెయ్ అంటూ ఇద్దరు యువకుల మధ్య వాగ్వాదం మొదలైంది.కత్తులతో దాడి, మాట మాట పెరగడంతో తీవ్ర అగ్రహానికి గురైన రవి పటేల్, మిటిలేష్ కుమార్ పై కత్తితో దాడి చేయగా తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన తోటి రూమ్మేట్స్ మరియు స్థానికులు వెంటనే బాచుపల్లి లోని మమత ఆసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణ ఈ ఘర్షణ పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అసలు గొడవ వంట కోసమే జరిగిందా లేక దీని వెనక మరేదైనా పాత కక్షలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడలతో విద్యార్థులకు మానసిక ప్రేరణ
### మెదక్ ప్రభుత్వ కొత్త ఉన్నత పాఠశాల క్రీడలు



మెదక్ జూలై 11 (సిరి న్యూస్)

తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ ఆధ్వర్యంలో శనివారం మెదక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 145 మంది విద్యార్థులకు జనరల్ వార్మింగ్ అప్ డైనమిక్ వార్మింగ్ అప్ క్రీడాకారుడి మానసిక ప్రేరణ క్రీడలలో అభివృద్ధి మొబిలిటీ, వేగం, బలం ప్లైయోమెట్రిక్ వ్యాయామాలు కూలింగ్ డౌన్ ,రికవరీ వ్యాయామాలు ఫణీంద్ర ఫెన్సింగ్ కోచ్ రుచందర్ వాలీబాల్ కోచ్ రాజేష్ అట్ల టిక్ కోచ్ ఫైజల్ ఫిజియోథెరపిస్ట్ నిర్వహించారు డైనమిక్ వామప్ కూలింగ్ డౌన్ ఓబిలిటీ ఎక్సర్సైజెస్ స్ట్రెంత్ స్పీడ్ ఎజిలిటీ కోఆర్డినేషన్ ఫ్లెక్సిబిలిటీస్ ఈ మోటార్ ఎబిలిటీస్ వీటి గురించి ఎక్సలేషన్ చేశారు వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ స్పోర్ట్స్ లో ఏ విధంగా రాణించాలని విషయాలపై స్పష్టంగా వివరించి వారికి ఎంతో అవగాహన ఆత్మవిశ్వాసం కలిగించారు విద్యతోపాటు స్పోర్ట్స్ కచ్చితంగా విద్యార్థికి రావాలని విద్యార్థులందరికీ అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్. శంకర్, పి.డి. మాధవ్ రెడ్డి, డివైఎస్ఓ సిబ్బంది, కోచ్‌లు పాల్గొన్నారు

## ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థతోనే సమాజ అభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్
- ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీలు



గుమ్మడిదల, జూలై 11 (సిరి న్యూస్):

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అవగాహన ర్యాలీలు నిర్వహించారు. జనాభా, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం, మాతాశిశు ఆరోగ్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుమ్మడిదలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఆరోగ్యవంతమైన కుటుంబ వ్యవస్థ కీలకమని అన్నారు. ఆధునిక జీవనశైలి, ఉద్యోగ ఒత్తిళ్లు, ఆలస్య వివాహాలు, అనారోగ్యకరమైన జీవన విధానాల కారణంగా దంపతుల్లో సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రభావం పడుతున్నట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగం, ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కూడా దెబ్బతీస్తాయని సూచించారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమయానికి వివాహం చేసుకుని కుటుంబ జీవితాన్ని సక్రమంగా కొనసాగించాలని సూచించారు. మహిళల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యవంతమైన భావితరాల కోసం కుటుంబ సంక్షేమం, మాతాశిశు ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, పార్టీ నాయకులు, మల్లారెడ్డి వైద్య కళాశాల విద్యార్థులు, డాక్టర్ నోయెల్, ఆరోగ్య విద్యాధికారి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీలక్ష్మి, మంజుల, భాగ్యలక్ష్మి, సభా ఆఫ్రీన్, ఏఎన్ఎంలు స్వరూప, వసంత, మణెమ్మ, సుబ్రహ్మణ్యం, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయ భవన విస్తరణ పనుల పరిశీలన

- నాణ్యతతో నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

గుమ్మడిదల, జూలై 11 (సిరి న్యూస్):



గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయ భవన విస్తరణ పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ప్రజలకు మరింత మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు అవసరమైన అదనపు కార్యాలయ గదుల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో పనుల పురోగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అనువుగా, అన్ని సౌకర్యాలతో ఉండేలా భవన నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ, గుమ్మడిదల మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్యాలయ విస్తరణ అవసరమైందని తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే ఈ విస్తరణ పనుల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పూర్తయిన అనంతరం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కత్తుల రమేష్, నాయకులు సత్యనారాయణ, కర్ణాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు దరఖాస్తు తప్పనిసరిగా సమర్పించాలి

- గుమ్మడిదల తహసీల్దార్ పరమేశం
- ఎస్ఐఆర్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్



గుమ్మడిదల, జులై 11 (సిరి న్యూస్):

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఓటరు దరఖాస్తుల స్వీకరణ హెల్ప్‌డెస్క్‌ను మండల తహసీల్దార్ ఎం. పరమేశం పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్ దరఖాస్తును పూర్తిస్థాయిలో నింపి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. అందిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులకు ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని, గ్రామ ప్రజాప్రతినిధులు, చదువుకున్న యువత, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటర్లకు దరఖాస్తులు నింపడంలో సహకరించాలని కోరారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఉట్ల యాదిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పాలనాధికారి లక్ష్మణ్, బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) గిరిజ, గ్రామస్థులు, ఓటర్లు పాల్గొన్నారు.

## జిల్లా కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు జర్నలిస్టులకు ఘన సన్మానం

- జర్నలిస్టు ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో అభినందన సభ

రామచంద్రపురం, జూలై 11 ( సిరి న్యూస్ ):



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులకు రామచంద్రపురంలోని బాలాజీ గార్డెన్స్ లో శనివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టు ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ బాసిత్ హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. సంఘం బలోపేతానికి అంకితభావంతో పనిచేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా జనరల్ సెక్రటరీ అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జనరల్ సెక్రటరీ భశ్వేశ్వర్, జిల్లా సంయుక్త కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఈసీ సభ్యుడు మజీద్ అలీలను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వంతో పాటు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు. ప్రతి జర్నలిస్టుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సభ్యుల సహకారంతో సంగారెడ్డి జిల్లా కమిటీని రాష్ట్రంలోనే ఆదర్శ కమిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని పేర్కొన్నారు.సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ప్రభాకర్ యాదవ్‌కు, ముఖ్య అతిథిగా హాజరైన అబ్దుల్ బాసిత్‌కు, కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులు, సంఘ సభ్యులందరికీ సన్మానితులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సవరణ ప్రక్రియలో భాగస్వాములు కావాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ దరఖాస్తు సమర్పించాలి

గుమ్మడిదల, జూలై 11 (సిరి న్యూస్):




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడమటి మైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుమ్మడిదలలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వారు పరిశీలించారు. దరఖాస్తుల నమోదు తీరును తెలుసుకుని బూత్ స్థాయి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ ప్రతి అర్హత గల ఓటరు తన పేరు ఓటర్ల జాబితాలో సక్రమంగా ఉండేలా ఎస్ఐఆర్ దరఖాస్తును తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, నిర్లక్ష్యం కారణంగా ఎవరూ ఆ హక్కును కోల్పోకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో చేపట్టిన ఈ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో బూత్ స్థాయి అధికారుల వద్ద యువకులను ఏర్పాటు చేసి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సందేహాలు ఉంటే బూత్ స్థాయి అధికారులను సంప్రదించి దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన కోరారు.

# నాడు జలకలా- నేడు వెలవెల

- వానలు కురిసేనా.... హల్ది నిండేనా ?
- చుక్కనీరు లేక వేలవేల బోతున్న వాగు
- వెల్దుర్తి ఉమ్మడి మండలంలో ప్రశ్నార్థకంగా సాగు!
- తుకాలు ఎండుతున్న కనికరం చూపని ప్రభుత్వం
- కాళేశ్వరం ద్వారా నీటిని విడుదల చేయాలని రైతుల డిమాండ్



**వెల్దుర్తి,జులై 11, (సిరి న్యూస్):**

మెదక్ జిల్లా వెల్దుర్తి ఉమ్మడి మండలంలో రైతులకు జీవనాధారంగా ఉన్న హల్దీ వాగు ఎండు ముఖం పట్టింది. ఏటా నీటితో నిండుకుండలా కళకళలాడు తుండేది. కానీ ఈసారి వానలు కురవక వాగు ఎండుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం హల్ది వాగుపై వెల్దుర్తి ఉమ్మడి మండలం లోని సుమారు 10 చెక్ డ్యామ్లను నిర్మించారు. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జలాలను ఎత్తిపోసి మల్లన్న సాగర్ ద్వారా హల్దీ ప్రాజెక్టు గుండా నిజాంసాగర్ కు ప్రాణం పోసేది. తద్వారా వర్గల్ తూప్రాన్,మసాయి పేట్, వెల్దుర్తి,కొల్చారం, మండలాల గుండా హల్దీ వాగు ప్రహవించి వాగు పరివాహ ప్రాంతమైన అన్ని గ్రామాలకు రెండు వైపులా పుష్కలమైన పంటలు పండేవి.వెల్దుర్తి మండలంలోని హస్తాల్పూర్, మెల్లూరు, ఆరెగూడెం, పంతులుపల్లి, రామాయపల్లి, శెట్ పల్లి గ్రామాల గుండా హల్ది వాగు ప్రవహి స్తున్నది. వాగు పరిధిలో సుమారు 4000 ఎకరాల విస్తీర్ణం వరకు సాగు చేస్తున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వర్షాకాలానికి ముందే మే నెల చివరి వారంలో హల్ది వాగులోకి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో రెండు పంటలు పండించారు. కానీ ఈ యాసంగి పంటకు ప్రాజెక్టు ద్వారా నీటిని తక్కువ పరిణామంలో విడుదల చేసేసరికి సరైన సమయానికి వర్షాలు రాక పోవడంతో వెల్దుర్తి మండలం లో ప్రవహిస్తున్న హల్దీ వాగు చుక్క నీరు లేకుండా ఎండిపోయింది. వానాకాలం మొదలై నెల రోజులు గడుస్తున్న భారీ వర్షాలు పడిన దాఖలాలు లేవు. రైతులు మాత్రం తూకాలు పోసి నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు.

**నీరు లేక ఇబ్బందులు**

హల్ది వాగు నుంచి ఫిల్టర్ బోర్ లు ద్వారా వ్యవసాయం చేసేవాళ్లం. గత సంవత్సరం కాలేశ్వరం నీరు విడుదల చేయడంతో రెండు పంటలు పండించాం. ఈసారి వ్యవసాయం చేయడం కష్టంగా ఉంది బోరుల కింద పంటలు వేసిన దక్కుతాయో లేదో అన్న అనుమానం కలుగుతున్నది. ఈసారి వానలు రాక, హల్ది వాగులో నీరు లేకపోవడంతో తక్కువగా వరి నాట్లు వేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కాలేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసి హల్ది వాగును నింపాలని మండల రైతులు కోరుతున్నారు.లేని పక్షంలో రైతులము రోడ్ల పైన కూర్చుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




# ప్రతి ఓటు.. ప్రతి ఇంటికి..

- మంచిర్యాల..బెల్లంపల్లి అర్హుల ఓటుపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి..
- ఓటరు జాబితా సవరణపై ముమ్మర ప్రచారం..
- ఇంటింటికీ చేరిన ప్రజాప్రతినిధులు..
- అర్హుల ఓటు హక్కు పరిరక్షణపై దృష్టి..
- అవగాహనతో పాటు దరఖాస్తుల సేకరణ వేగం..



ఓటు హక్కు పరిరక్షణకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు భీమిని రాజేష్ నరేష్ దినేష్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 11 (సిరి న్యూస్)**

ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడి ఓటు హక్కు సురక్షితంగా ఉండాలనే లక్ష్యంతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జిల్లాలో విస్తృతంగా కొనసాగుతోంది. అర్హులెవరూ ఓటరు జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రతి ఇంటికి చేరుకుని అవగాహన కల్పిస్తూ దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ప్రజలు తమ వివరాలను సరిచేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని నాయకులు పిలుపు నిచ్చారు.మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో ఎనిమిదో డివిజన్ పరిధిలోని అరుణక్క నగర్, జన్నీనగర్, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎనిమిదో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిని రాజేష్ నేతృత్వంలో ఆత్మకూర్ సతీష్, నరిగే నరేష్, నస్పూర్ పట్టణ సమన్వయకర్త దుర్గం దినేష్ ప్రజలను కలిసి ఓటరు జాబితా సవరణపై వివరాలు తెలియజేస్తూ దరఖాస్తులను సేకరించారు..

**మరోవైపు బెల్లంపల్లి పరిధిలో..**

అదే విధంగా బెల్లంపల్లి పరిధిలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్వయంగా ప్రజల ఇళ్లకు వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హుల వివరాలను నమోదు చేస్తూ ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలమని, ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చూడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయబద్ధంగా కొనసాగాలని నాయకులు కోరారు. ప్రతి అర్హుడు తప్పనిసరిగా తన వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని, ఓటు హక్కు పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



ఓటు హక్కు పరిరక్షణకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు భీమిని రాజేష్ నరేష్ దినేష్

# ఎమ్మెల్యే వినోద్‌కు యాదాద్రి గౌరవం

- యాదాద్రి పాలక మండలిలో వినోద్‌కు కీలక బాధ్యత..
- ఎమ్మెల్యేకు నెన్నెల కాంగ్రెస్ నాయకుల ఘన సత్కారం..

**మంచిర్యాల ప్రతినిధి జూలై 11 (సిరి న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా నియమించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి శనివారం యాదాద్రి దేవస్థానంలో ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నియామకం బెల్లంపల్లి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది.ప్రమాణ స్వీకారం అనంతరం నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ప్రజా సేవలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి అభినందనలు తెలుపుతూ, ఆయనకు లభించిన ఈ బాధ్యత నియోజకవర్గ ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు.



# పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం!

- పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్ రామ్ రెడ్డి.!!

**శివంపేట జులై 11( సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని గోమారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ముఖ్య అతిథులుగా శివంపేట మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, సుధీర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ హైమావతి ఆంజనేయులు, ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి, మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.



# బీజేపీ స్టేట్ టీచర్స్ సెల్ కో-కన్వీనర్‌గా సుమన్ రావు!

**కుత్బుల్లాపూర్, జూలై11, సిరి న్యూస్**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర టీచర్స్ సెల్ కో–కన్వీనర్‌గా సుమన్‌రావు నియమితులయ్యారు. బీజేపీలో సుమన్ రావు గతంలో విద్యార్థి పరిషత్ ఏబీవీపీలో ఎన్నో విద్యార్థి ఉద్యమాలను ముందుండి నడిపించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, మల్కాజ్‌గిరి పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్‌గా పార్టీలో వివిధ బాధ్యతలో పనిచేసిన అనుభవం, ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసిన అనుభవం ఉంది. పార్టీ నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తానని, కార్యకర్తలను, నాయకులను కలుపుకొని ముందుకు వెళ్తానని ఈ సందర్భంగా సుమన్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ఈ నియమకానికి సహకరించిన పార్టీ పెద్దలకు సుమన్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

# హిందూ సంస్కృతికి ప్రతీక గో సేవ!

**ఘనంగా గోశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే**



**అమీన్పూర్ జూలై 11 సిరి న్యూస్**

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని సుల్తాన్పూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను శనివారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూహిందూ సాంప్రదాయంలో గోమాతకు విశేష స్థానం ఉందని గోవులను సంరక్షించడం మనందరి బాధ్యతని పిలుపునిచ్చారు. గోమాతల సంరక్షణ, సేవ మరియు పరిరక్షణ కోసం గోశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గోశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. హాజరైన అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజు, శ్రీకాంత్, గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# మంచిని ధైర్యంగా ఆచరించడం మానవత్వం

**పాపన్నపేట్ జూలై 11 (సిరి న్యూస్) :**



మండల పరిధిలోగల నాగుసానిపల్లి గ్రామ పరిధిలో గల శ్రీ ఉమా కేదారేశ్వర క్షేత్రంలో ప్రతి మాసంలో జరిగే పూజా కార్యక్రమంలో శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు మాట్లాడుతూ మంచిని ధైర్యంగా ఆచరించడం మానవత్వమని అన్నారు. ప్రతిరోజు భగవంతుని స్మరణ చేయటం నిత్యం పూజా కార్యక్రమాలు చేపట్టడం వల్ల మనశ్శాంతి లభిస్తుందని తద్వారా దైవ శక్తిని పొందగలుగుతామని అన్నారు. ప్రతి సమస్యకు భగవంతుడు పరిష్కారం ఎలా చూపెడతాడు, అలాగే ప్రతినిత్యం భగవంతుని పూజించడం కూడా మనకు మంచి ఆలోచనతో పాటు మన సమస్యలు తొలుగుతాయని తెలిపారు. స్వామివారికి ఇంద్రసేనారెడ్డి దంపతులు పాదపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ, శ్యామ్ సుందర్ శర్మ, రామ్ శర్మ, శ్రావిత్ శర్మ, పార్స నర్సింలు, యాబన్న సెట్, మోహన్ రెడ్డి, ఎర్రం రవీందర్, సాయిబాబా, మహేందర్, పార్స శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ..



**వెల్దుర్తి:, జూలై 11 (సిరి న్యూస్)**

వెల్దుర్తి మండల కేంద్రంలోని గోన మైసమ్మ ఆలయ సమీపంలో పెద్దమ్మ దేవాలయ నిర్మాణానికి శనివారం సర్పంచ్,ఆదర్శ్, ఉపసర్పంచ్, శ్రవణ్,ముఖ్య అతిధిలుగా పాలుగోని ముదిరాజ్ సంఘము సభ్యుల అధ్యర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఆధ్యాత్మిక వాతావరణం లో నూతన ఆలయం నిర్మించ నున్నట్లు ముదిరాజ్ సంఘ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కావాలని పెద్దమ్మ తల్లి ని కోరుకుంటూ న్నట్లు సభ్యులు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, లు మాట్లాడుతూ, దేవాలయం అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా స్థానిక ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని సంఘ సభ్యులు పేర్కొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )లో ప్రతి ఓటరు పాల్గొనాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**శివంపేట్ జులై 11(సిరి న్యూస్ )**

శివంపేట మండలంలోని గోమారం స్వగ్రామంలో ఎమ్మెల్యే సునీత రెడ్డితో పాటు జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్ (సర్) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివరాల సేకరణకు వచ్చిన బిఎల్ఓ షాలిని తో తమ వివరాలు నమోదు చేయించి, బిఎల్ లు ఎక్కడా.. నిరశపడకుండా గ్రామంలోని ప్రతి ఓటర్ ను సంప్రదించి, వివరాలు సేకరించాలని, ఆ క్రమంలో నిరక్షరాస్యులకు, వృద్ధులకు మద్దతుగా బిఎల్ఓ లే ఫారాలు మానవతా దృక్పథంతో ఫారాలు నింపి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి,పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సిరి వార్త...బెదిరింపులతో ఆగదు.!

- బీఎల్‌వోల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే... కాగ్రెస్ నాయకుల బెదిరింపులా.?..
- ప్రజలకు పరిష్కారం కాదు... ఫోటోలకు పోజులా..?
- ప్రచారం ముఖ్యమా.!...ప్రజల కష్టాలు ముఖ్యం కాదా.?
- నిజాలు రాస్తే భయపడేది లేదు... వెనక్కి తగ్గేది లేదు.!
- దమ్ముంటే వార్తను ఖండించండి... ప్రతి ప్రశ్నకు ఆధారాలతో సమాధానానికి సిద్ధమే..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 11 ( సిరి న్యూస్**





మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో ప్రత్యేక ఓటరు నమోదు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అమలుపై క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సిరి తెలుగు దినపత్రిక ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడం మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. స్థానికులు పంపిన ఫోటోలు, ఓటర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా ప్రచురించిన కథనం అనంతరం ప్రజల్లో విస్తృత చర్చ ప్రారంభమైంది. అయితే కథనంలో లేవనెత్తిన అంశాలపై స్పందించి వివరణ ఇవ్వాల్సిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల నుంచి జిల్లా సిరి ప్రతినిధికి ఫోన్ కాల్స్ ద్వారా ఒత్తిడి తీసుకురావడం, హెచ్చరికల తరహా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు తలెత్తేలా చేసిందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రత్యేక ఓటరు నమోదు సవరణ ప్రక్రియలో ప్రజలకు ఇంటి వద్ద సేవలు అందుతున్నాయా.? బీఎల్‌వోలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పనిచేస్తున్నారా.? అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు సక్రమంగా అందుతున్నాయా.? వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయంలో, కొందరు నాయకులు ప్రజలకు ఫారాలు అందజేస్తూ ఫోటోలు దిగడం, వాటిని వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికల్లో విస్తృతంగా ప్రచారం చేసుకోవడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు సేవ చేస్తున్నామనే సందేశం ఇవ్వడం ఒక విషయం.. కానీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం మరో విషయం. ప్రచార ఫోటోలు, సోషల్ మీడియా పోస్టులు, రాజకీయ ప్రచారం కంటే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ముఖ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు చెబుతున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రచార కార్యక్రమాలకే పరిమితమైతే ఎస్ఐఆర్ వంటి కీలక ప్రక్రియ లక్ష్యం దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమలవుతున్నాయా అనే అంశమే అసలు చర్చ కావాల్సిన సమయంలో, వార్తను రాసిన విలేకరినే లక్ష్యంగా చేసుకోవడం ఎందుకనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఒకవేళ సిరి తెలుగు దినపత్రిక ప్రచురించిన కథనంలో వాస్తవపరమైన లోపాలు ఉన్నాయని ఎవరైనా భావిస్తే, వాటిని ఆధారాలతో ప్రజల ముందుంచాలని పత్రిక పేర్కొంటోంది. కానీ వార్తను ఖండించకుండా, విలేకరిపై ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యగా భావిస్తున్నామని మీడియా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రభుత్వాన్ని, అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ప్రజల తరపున ప్రశ్నించే గొంతును అణచివేయాలని చేసే ప్రతి ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. సిరి తెలుగు దినపత్రిక ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదు..ఏ రాజకీయ పార్టీకి అనుకూలం కూడా కాదు. ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం మాత్రమే మా లక్ష్యం. ఆధారాలతో వచ్చిన ప్రతి ప్రజా సమస్యను నిర్భయంగా ప్రచురించడం మా వృత్తి ధర్మం. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగే వరకు..ప్రతి ఇంటి గడపకు సేవలు చేరే వరకు..ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు..ప్రజల తరపున మా నిఘా కొనసాగుతుంది. ప్రశ్నించే కలం ఆగదు..ప్రజల గొంతును మూయలేరు.. ఆధారాలతో రాసే వార్తలను బెదిరింపులతో ఆపలేరు..సిరి వార్త... బెదిరింపులతో ఆగదు..!

# భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన!



- దైవ దర్శనం చేసుకున్న స్థానిక ఎమ్మెల్యే
- గూడెం మహిపాల్ రెడ్డి..

**జిన్నారం జులై 11 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఇమామ్ నగర్ గ్రామంలో శనివారం శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని..ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అమ్మ వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు,స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాలతో...

- కదిలి న మున్సిపల్ యంత్రాంగం.
- ప్రధాన రహదారి విస్తరణకు అడుగులు.
- డిజిటల్ లైనింగ్ సర్వే ప్రారంభించిన అధికారులు.

**రామాయంపేట, జూలై 11 (సిరి న్యూస్)**



ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామాయంపేట పట్టణ ప్రధాన రహదారి విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ రద్దీ, వాహనదారులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణకు మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో శనివారం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో డిజిటల్ లైనింగ్ సర్వే నిర్వహించారు. రహదారి వెడల్పు, సరిహద్దులు, అవసరమైన స్థల వివరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలించి కొలతలు నమోదు చేశారు.సర్వే అనంతరం అధికారులు మాట్లాడుతూ, రహదారి విస్తరణ ప్రక్రియను వేగవంతం చేసి అవసరమైన పరిపాలనా అనుమతులు పూర్తిచేసి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు పట్టణ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 9 వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్, ఎనిమిదో వార్డు బిజెపి కౌన్సిలర్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చింతల యాదగిరి, డాకి స్వామి, బిఆర్ఎస్ నాయకులు మద్దెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నారంలో అగ్నిప్రమాదం



- ఇంట్లో సామగ్రి, బంగారం, విద్యా ధ్రువపత్రాలు దగ్ధం
- సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది.. భారీ ప్రమాదం తప్పింది

**గుమ్మడిదల, జూలై 11 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలతో పాటు విలువైన బంగారు వస్తువులతో పాటు విద్యా ధ్రువపత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన స్థానికంగా ఆందోళనకు గురి చేసింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం అన్నారం వార్డులోని ప్రకృతి నివాస్ కాలనీలో నివాసం ఉంటున్న సోలమన్ కుటుంబం ఇంటి దిగువ అంతస్తులో ఉండగా, పై అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంటి పైభాగం నుంచి పొగలు, మంటలు ఎగసిపడుతున్నట్లు గమనించిన పొరుగువారు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పై అంతస్తుకు చేరుకునేలోపే మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న జీడిమెట్ల, దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లో ఉన్న బంగారు వస్తువులు, గృహోపకరణాలు, ఫర్నిచర్, ఇతర సామగ్రితో పాటు కుటుంబ సభ్యులకు చెందిన విలువైన విద్యా ధ్రువపత్రాలు పూర్తిగా కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు వారు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ లేదా ఇతర కారణాలపై దర్యాప్తు చేపట్టాల్సి ఉందని స్థానికులు పేర్కొన్నారు. గుమ్మడిదల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు



# ప్రగతి ధర్మారంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.

- నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి మహేందర్ రెడ్డికి ఘన సన్మానం.

**రామాయంపేట, జూలై 11 (సిరి న్యూస్)**



రామాయంపేట మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయం శనివారం కాంగ్రెస్ శ్రేణులతో కళకళలాడింది. రాష్ట్ర నాయకులు హన్మంత్ అన్న, మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్న నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండారి మహేందర్ రెడ్డికి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువా, పార్టీ కండువాతో సన్మానించారు.గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు మాదిగల రాములు, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డిలను కూడా పార్టీ కండువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బండారి శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ లలితా రమేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్య భద్రతకు, అత్యవసర వైద్య అవసరాలకు అండగా నిలుస్తోందని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఊరట కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారుమండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి మహేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచులు రామకృష్ణయ్య, శ్రీనివాస్, సునీల్, ఉమా సంజీవరెడ్డిసీనియర్ నాయకులు ఉడుత రాజేశం, మస్కుల సిద్ధరాంరెడ్డి (మాజీ ఎంపీటీసీ), షాదుల్లా, వడ్ల శ్రీశైలం, చాకలి చిన్న నారాయణ, శ్రీధర్ రెడ్డి, సిద్ద రాము రెడ్డి, సందీప్, కుమార్ సాగర్, దుర్గం, మల్లేశం, వార్డు సభ్యులు బండారి మహేందర్ గౌడ్, కట్ట మల్లేశం, యువ నాయకులు పెట్టేరి నాగరాజు, దొమ్మాట రవీందర్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

- భారతి నగర్ డివిజన్‌లో హెల్ప్‌డెస్క్‌లను సందర్శించిన మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి

**రామచంద్రపురం, జూలై 11 (సిరి న్యూస్):**



భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి శనివారం డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ, మాక్ సొసైటీ కాలనీల్లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) హెల్ప్‌డెస్క్‌లను సందర్శించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. ఫారాలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేయడంతో పాటు ప్రతి ఓటరికి సరైన మార్గదర్శకత్వం అందించాలని సంబంధిత అధికారులకు, ఏజెంట్లకు సూచించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓకు అందజేయాలని కోరారు. ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేయించుకోవడం ద్వారా తమ ఓటు హక్కును పరిరక్షించుకోవచ్చని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని, ఓటరు నమోదు, సవరణల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సింధు ఆదర్శ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సుల్తాన్‌పూర్ క్యాంపస్ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ
- జేఎన్‌టీయుకు 2 బస్సులు, 3 ప్రయోగశాలలు ప్రారంభం
- జేఎన్‌టీయులో భారీ క్లాక్‌టవర్



**జోగిపేట, జూన్ 11, (సిరి న్యూస్)**

సుల్తాన్‌పూర్ క్యాంపస్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కళాశాల బస్సులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ అండ్ సిమ్యులేషన్ ల్యాబొరేటరీ, స్మార్ట్ కంప్యూటింగ్ ల్యాబొరేటరీ, కంప్యూటర్ అప్లికేషన్స్ ఇన్ ఫార్మసీ ల్యాబొరేటరీలను రాష్ట్ర వైద్య ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతను ఇస్తుందని ఆధునిక ప్రయోగశాలలు విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాయోగిక అవగాహన కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మరింత పెంచుతాయని అన్నారు. తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా రెండు కళాశాలలకు బస్సులను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ బస్సుల ద్వారా విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. కొత్తగా ప్రారంభించిన ప్రయోగశాలల్లో సెమీకండక్టర్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధికి ఈ ప్రయోగశాలలు దోహదపడతాయన్నారు. జేఎన్‌టీయులో క్లాక్‌టవర్ సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో ప్రతిపాదిత క్లాక్ టవర్ నిర్మాణ స్థలాన్ని మంత్రి పరిశీలించి, నిర్మాణ రూపకల్పన, వ్యయ అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. క్లాక్ టవర్ విద్యార్థుల్లో సమయపాలన, క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.అలాగే, జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, అందోల్ క్యాంపస్ నిర్మాణానికి రూ.57 కోట్లు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. మంత్రి, భవనాల నిర్మాణానికి సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్‌ను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి. జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ డా. ఎ. దామోదరం, చీఫ్ ఇంజనీర్ డా. ఎస్. శ్రీనివాసులు, జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. సునీత రెడ్డి, యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రాఘవేందర్ రావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తోషిబా సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలకు ఎమ్మెల్యే ప్రశంసలు..

- రక్తదానంతో ప్రాణాలకు భరోసా..
- రక్తదాతలకు ఎమ్మెల్యే సన్మానం..
- 52వ డివిజన్‌లో మెగా రక్తదాన శిబిరం..
- స్వచ్ఛంద సేవకు ప్రేమ్ సాగర్ రావు అభినందనలు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 11 (సిరి న్యూస్)**




రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి కొత్త జీవం అందించవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పిలుపునిచ్చారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్‌లో మంచిర్యాల క్లబ్ ఆధ్వర్యంలో, భారత రెడ్‌క్రాస్ సంఘం మంచిర్యాల శాఖ సహకారంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రక్తదానం చేసిన దాతలకు ఆయన స్వయంగా రక్తదాన ధృవపత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం అనేది అత్యంత గొప్ప మానవతా సేవ అని, ఒక్కో యూనిట్ రక్తం పలువురి ప్రాణాలను కాపాడగలదన్నారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన మంచిర్యాల క్లబ్ సభ్యులను, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ హృదయపూర్వకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, స్థానిక కార్పొరేటర్ సాయినీ స్రవంతి, కిషోర్, క్లబ్ అధ్యక్షుడు వెంకట రమణారావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి నర్సింగరావు, ఉపాధ్యక్షులు జితేందర్ రావు, కొత్త రాజేశం, శశిపాల్ రెడ్డి, కార్యదర్శులు వడ్డే రాజమౌళి, జుర్రు నగేష్, కల్వల జగన్ మోహన్ రావు, నల్ల శ్రీనివాస్, క్రీడా కార్యదర్శి సత్యపాల్ రెడ్డి, నాయకులు, క్లబ్ సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.

# మంబాపూర్ అంగన్‌వాడీ టీచర్ పోస్టు రిజర్వేషన్‌పై గ్రామస్తుల అభ్యంతరం

- బీసీ–ఈ అభ్యర్థులే లేని గ్రామంలో ఆ వర్గానికి పోస్టు కేటాయింపు
- రిజర్వేషన్‌ను పునఃపరిశీలించాలని అధికారులకు విజ్ఞప్తి

**గుమ్మడిదల, జులై 11 (సిరి న్యూస్):**


తెలంగాణ ప్రభుత్వం
మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, సంగారెడ్డి జిల్లా
No. 31/A/2026 Dt.04/07/2026
BC-E

గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ పోస్టును బీసీ–ఈ రిజర్వేషన్‌కు కేటాయించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బీసీ–ఈ వర్గానికి చెందిన అర్హులైన అభ్యర్థులు ఎవరూ లేని పరిస్థితిలో ఆ వర్గానికి పోస్టు కేటాయించడం సమంజసం కాదని వారు ప్రశ్నిస్తున్నారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు విడుదల చేసిన నియామక ఉత్తర్వుల ప్రకారం మంబాపూర్ అంగన్‌వాడీ టీచర్ పోస్టు బీసీ–ఈ వర్గానికి కేటాయించబడింది. అయితే గ్రామంలో ఆ వర్గానికి చెందిన కుటుంబాలు, అర్హత కలిగిన అభ్యర్థులు ఎవరూ లేరని స్థానికులు చెబుతున్నారు. రిజర్వేషన్ ఖరారు చేసే ముందు గ్రామంలోని సామాజిక వర్గాల వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఉండాల్సిందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో సంబంధిత వర్గానికి చెందిన అభ్యర్థులే లేని పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా రిజర్వేషన్ ప్రకటించడం వల్ల పోస్టు భర్తీపై అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ పాలకవర్గం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఇతర రిజర్వేషన్ వర్గాలకు చెందిన అర్హత కలిగిన విద్యావంతులైన మహిళలు ఉన్నందున, స్థానిక పరిస్థితులను పరిశీలించి రిజర్వేషన్‌ను పునఃసమీక్షించి తగిన మార్పులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ అంశంపై మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు స్పందించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పేగుల్లో దాగి ఉండే నులిపురుగులను నివారించడమే లక్ష్యంగా ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం

- మండల వైద్యాధికారిణి డాక్టర్ గోడిశాల నవత గౌడ్
- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేయనున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జులై 11, (సిరి న్యూస్)**

పిల్లల్లో దాగి ఉన్న నులిపురుగులను నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మొగుళ్లపల్లి మండలంలో విజయవంతం చేయుటకు వైద్య సిబ్బందికి మండల వైద్యాధికారిణి డాక్టర్ గోడిశాల నవత గౌడ్ తగిన సూచనలు చేస్తూ, శనివారం ఆమె ఒక ప్రకటనను విడుదల చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు, ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా మొగుళ్లపల్లి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో 1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయబడతాయని, ఆయా గ్రామాలలో గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ప్రారంభించబడతాయన్నారు. అనంతరం ఆల్బెండాజోల్ మాత్రల ఆవశ్యకత గురించి ఆమె వివరించారు. ఆల్బెం డాజోల్ మాత్రలు పిల్లల పేగుల్లో దాగి ఉండే నులి పురుగులను నివారించడానికి ఉపయోగపడతాయన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, బలహీనత, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల నులి పురుగులు నశించి, పిల్లల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు వారు తీసుకునే పోషకాహారం శరీరానికి సమర్థవంతంగా అందుతుందన్నారు. కాబట్టి మండలంలోని 1–19 సంవ త్సరాల వయస్సు గల బాల బాలికలు తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, మరియు ప్రజా ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పాత్రికేయులు మరియు మండల ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు సర్ ప్రాముఖ్యతను వివరించిన కాంగ్రెస్ నేతలు

**దౌల్తాబాద్, జూలై 11, (సిరి న్యూస్):**

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో సర్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దౌల్తాబాద్, తిరుమలపూర్, శేరిపల్లి బందారం, తిమ్మక్కపల్లి, రాయపోల్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వెన్నెల, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. సర్ కార్యక్రమం ప్రాముఖ్యతను వారు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనగామ మల్లారెడ్డి, రాయపోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగర రవి, చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ తాడెం వెంగళరావు, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ రెడ్డి, మిరుదొడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్ తో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ మండలాల నాయకులు, గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వృద్ధురాలు అదృశ్యం

## కేసు నమోదు చేసిన గుమ్మడిదల పోలీసులు

## ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి

**గుమ్మడిదల, జూలై 11 (సిరి న్యూస్):**



గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుమ్మడిదల ఎస్సై అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గుమ్మడిదల గ్రామానికి చెందిన పానగారి శాంతమ్మ (65) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. పలుచోట్ల గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు పానగారి రమేష్ గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వృద్ధురాలి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పానగారి శాంతమ్మ గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు ప్రజలను కోరారు.

# అవినీతి నిలయంగా మారిన పోలీస్ స్టేషన్..!

- మట్టి మాఫియాతో పోలీసుల దోస్తీ..!
- జోరుగా భూ వివాదాలు, లంచాలు..!
- స్టేషన్కు రావడానికి జంకుతున్న బాధితులు
- ఫిర్యాదుకు వస్తే బాధితుల జేబుకు చిల్లు
- చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్



**మిరుదొడ్డి, జూలై 11, (సిరి న్యూస్) :**

శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీస్ స్టేషన్ అవినీతికి అడ్డాగా మారింది. అక్రమ దందాలు చేసే వారితో చేతులు కలిపి కాసులకు కక్కుర్తి పడుతు జేబులు నింపుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్లో అవినీతి, లంచాలు రాజ్యమేలుతున్నాయని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. రాత్రి సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా చేస్తున్న మట్టి అక్రమ రవాణాకు పోలీసులు మట్టి మాఫియాతో చేతులు కలిపి వేల రూపాయలు దండుకుం టున్నారని పలువురు ఆరోపణలు చేస్తు న్నారు. భూ సమస్యలపై ఏమైనా గొడవలు జరిగి పోలీస్ స్టేషన్కు చేరితే డబ్బులు సమర్పించుకున్న వారికే వత్తాసు పలుకుతూ ఎదుటి వారికి కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేసిన ఘటనలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తు న్నాయి. ప్రమాదవశాత్తు మరణించినా, చివరికి ప్రేమ పెళ్లిళ్లు చేసుకుని పోలీస్ స్టేషన్ ను నూతన జంటలు ఆశ్రయిస్తే డబ్బులు ఆశించడం పరిపాటిగా మారిందని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిపై కేసు నమోదు చేయకుండా భారీ ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఇక ప్రతి నెల వైన్సులు, బెల్ట్ షాపు, కల్లు డిపోల నుండి మామూలు తీసుకోవడం ఆనవాయితీగా కొనసాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ ఎస్సైగా సతీష్ బాధ్యతలు చేపట్టి మూడు నెలలు కాకముందే ఇంతలా అవినీతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాజ్యమేలుతుండడంతో మండల ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. బాటంగా ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకో వాలని కోరుతున్నారు. లేదంటే సామా న్యులు పోలీస్ స్టేషన్ కు రావడానికే జంకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న అన్ని వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఒక్క మొక్క భవిష్యత్ తరాలకు జీవన భరోసా బిజెపి నాయకులు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 11, (సిరి న్యూస్) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధిలోని ఎచ్.ఎం.టీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "మా కే నామ్ పే ఏక్ పేడ్" (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యతను వివరించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచిస్తూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, బిజెపి ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్, నార్లకంటి దుర్గయ్య, నల్లనాగుల కృష్ణ, చిత్తారీ, నాగదీప్ గౌడ్, అర్జున్ ముదిరాజ్, మానస్ గౌడ్, పృథ్వి, ఆర్థిక్ యాదవ్, వర్మ, ఈశ్వర్, శివ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

**చొప్పదండి ప్రతినిధి, జూలై 11, (సిరి న్యూస్) :**

జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని తెలంగాణ ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మంత్రి ముందుగా శ్రీ ఆంజనేయస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడైన శ్రీ బేతాళస్వామిని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, రాజేందర్ రెడ్డి, ఎస్సై సందీప్. ఏఎస్సై రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మురుగన్ నేపథ్యంలో చిత్రాల నిర్మాణం

## తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు

దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్ మరియు వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేలకూ రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.



# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

## లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున







తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భాగ్యశ్రీ బోర్సే .. భావోద్వేగం



'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

## తండ్రిని హత్తుకున్న అఖిల్

అఖిల్ మూవీ హిట్ అయితే చూడాలని ఆశగా ఎదురుచూసిన అక్కినేని అభిమానుల కల నెరవేరింది. ఆయన కథానాయకుడిగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా అఖిల్ నటన, ద్వితీయార్థంలో వచ్చే ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ సక్సెస్ సెలబ్రేషన్స్ జరిగాయి. చిత్ర బృందం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంది. ఈ సందర్భంగా తండ్రి నాగార్జున పాదాలకు నమస్కరించిన అఖిల్.. ఆయన్ను గట్టిగా హత్తుకుని భావోద్వేగానికి గురయ్యారు.



# 24న రామాయణ ట్రైలర్ విడుదల

భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.